క్లుప్తంగా

ఆలయ పాలకవర్గ ఏర్పాటుకు మార్గం సుగుమం



పాత గుంటూరు: ఆర్.అగ్రహారంలోని కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం నూతన పాలక వర్గ ఏర్పాటుకు మార్గం సుగుమమైంది. ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన దేవరశెట్టి సత్యనారాయణ చైర్మన్ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. ఆదివారం ఆలయంలో విలేకరుల సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. 2009 నుంచి ఆలయ చైర్మన్‌గా పనిచేసినట్లు తెలిపారు. ఆర్యవైశ్య ప్రముఖులు, ఎమ్మెల్యేలు షేక్ మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్‌రావు సమక్షంలో తాను చైర్మన్ పదవి నుంచి వైదొలిగి, నూతన పాలక వర్గానికి సహకరిస్తానని అన్నారు. త్వరలో నూతన పాలకవర్గ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే ముస్తఫా తెలిపారు.

ఏమార్చి.. కార్డు మార్చి

ఏటీఎం సెంటర్‌లో మోసం

గుంటూరు ఈస్ట్: ఏటీఎం సెంటర్‌లో గుర్తు తెలియని దుండగుడు ఓ వ్యక్తి ఏటీఎం కార్డును మార్చివేసి మోసంచేసిన సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామ్ నగర్‌కు చెందిన ఈర్ల ఏడుకొండలు ఈనెల 9వ తేదీ గుజ్జనగుండ్ల సెంటర్‌లోని యూబీఐ ఏటీఎం సెంటర్‌కు వెళ్లాడు. డబ్బులు సీడీఎంలో డిపాజిట్ చేస్తుండగా ఓ వ్యక్తి అతనికి సహయపడ్డాడు. రూ.30వేలు డిపాజిట్ చేశాడు. కొంత సేపటికి ఏడుకొండలు ఖాతా నుంచి 50వేలు విత్‌డ్రా అయినట్లు సెల్‌కి మెసేజ్ వచ్చింది. ఏటీఎం కార్డు పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తి కార్డు మార్చివేసినట్లు గుర్తించాడు. ఏడుకొండలు ఆదివారం పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ



నగరంపాలెం: అందరూ ఉండి కూడా వృయోవృద్ధులు అనాథలుగా మారుతున్నారని, అటువంటి వారికి ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని జానీ కాంప్లెక్స్ ఆవరణలోని సమితి కార్యాలయంలో ఆదివారం 60 మంది వయో వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, పన్నెండు రకాల నిత్యావసర సరుకుల కిట్లను అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి మాదాల ప్రకాష్, సహాయ కార్యదర్శి ఎస్వీ రమణ, పోలేపల్లి వెంకట సుబ్రమణ్యం, పల్లంపాటి రజనీశ్వరరావు, జె.లలితా ప్రసాద్, మామిడి ప్రతీక్, గోపీ తదితరులు పాల్గొన్నారు.

మహిళతో అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

పట్నంబజారు: మహిళతో అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఆనందపేటకు చెందిన కంబ్రాతి రమాదేవి చిన్నాచితక పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో ఆదివారం గాంధీపార్క్ వద్ద కూలి పనులు చేసుకుని తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో కళ్లు తిరగటంతో ఒక దుకాణం వద్ద కూర్చుంది. అదే ప్రాంతంలో ఉండే ఉదయగిరి గోపాలకృష్ణ ఆమెను ఇబ్బందులకు గురి చేసి తన కోరిక తీర్చాలంటూ.. దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా భావనారుషి కల్యాణం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వాహించారు. దేవస్థానంలో స్వామి వారికి 16 రోజుల పండగ పూజా కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి జరిగిన పవళింపు సేవా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం ఏర్పాటు చేసిన హరే శ్రీనివాసా కోలాటం, భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భావనారుషి స్వామికి కైంకర్యపరులు చింతక్రింది కళ్యాణ్‌కుమార్, కుటుంబ సభ్యులు, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ మునగాల భాగ్యలక్ష్మి, మునగాల మల్లేశ్వరరావు, అందె శివశంకరరావు, శ్రీపాత మంగళగిరి పద్మశాలీయ సంఘం అధ్యక్షులు పూట్ల పాల శ్రీనివాసరావులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద శ్రేష్టులు తిరువీధుల కృష్ణాంజనేయులు, కాండ్రు అమరలింగేశ్వరరావు, మునగాల రామారావు, పూట్ల రథంగపాణి, తుమ్మా నరింహమూర్తి, శ్రీపాత మంగళగిరి పద్మశాలీయ సంఘం సెక్రటరీ బిట్రా శ్రీనివాసరావు, కోశాధికారి జొన్నాదుల గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జగ్గారపు వెంకట నారాయణ, జంజనం దుర్గారావు, గుడిపూడి శివకృష్ణ, మునగాల ధనంజయుడు, మునగాల వేణుకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

పేదల గడపల్లో సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- 45వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే గిరిధర్

కొరిటిపాడు(గుంటూరు): నవరత్నాలు, సంక్షేమ పథకాల అమలుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. ఆదివారం 45వ డివిజన్ 134వ సచివాలయం పరిధిలోని కొరిటిపాడు, హనుమయ్యనగర్‌లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరిస్తూ వారికి ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని ఎమ్మెల్యే కోరారు. స్థానికులు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ ప్రభుత్వ జనరంజక పాలనపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. తమ పర్యటనకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే జనం గుండెల్లో జగనన్న ఏ స్థానం పొందారో అర్థమవుతోందన్నారు. మూడున్నరేళ్లలో మేనిఫెస్టోలోని 98 శాతం హామీలన్నీ అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని, మిగిలిన వాటిని ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ఆయా రంగాల్లో ఎన్నడూ లేనంత ప్రగతి చేసి చూపారని, విద్య, వైద్యం విధానాన్ని పూర్తిగా ప్రక్షాళించి మెరుగైన సేవలందేలా వసతులు, యంత్రాలు, సాంకేతికతను సమకూర్చారని తెలిపారు. 104, 108 ను ఆధునికంగా తీర్చిదిద్ది మరింత మెరుగ్గా నిర్వహిస్తే ఆపత్కాలంలో బాధితులకు మెరుగైన సేవలందించేలా అమలు చేస్తున్నారన్నారు. దేశంలోని ఏ ప్రభుత్వం అందించని పథకాలను సీఎం వైఎస్ జగన్ అందిస్తున్నారని వివరించారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించే దిశగా ప్రభుత్వం అడుగులేస్తుందని, మూడున్నరేళ్లలో ప్రజల వద్దకే పాలన అందించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని కొనియాడారు. కార్పొరేటర్ యక్కలూరి మారుతి, పార్టీ నాయకులు కోటిలింగారెడ్డి, యండి బాబూఖాన్, బి.వీరారెడ్డి, ఒంటెద్దు ఓబుల్‌రెడ్డి, వెంకట శివ రాఘవరెడ్డి, వెంకటరెడ్డి, ప్రభాకర్, భరత్‌రెడ్డి, అట్ల శ్రీనివాసరెడ్డి, సత్యం, శివనాగు, శివ కోటి, ఎల్లారెడ్డి, కోటిరెడ్డి, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంపై కళా సాధ కార్యదర్శి బిల్లా అశోక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాయకులు సుధీర్, స్టాలిన్ బాబు, సుబ్బారావు, బొల్లేపల్లి సుబ్బారావు, పద్మశ్రీ, కృష్ణశ్రీ పాల్గొని కృష్ణ నటించిన సినిమాల్లోని పాటలను ఆలపించారు. అనంతరం కళాసాధ అధ్యక్షుడు కళాభూషణ బి.వేదయ్య రచించిన వేదనా నాదం పుస్తకాన్ని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు నూతలపాటి తిరుపతయ్య, దాసరి హనుమంతరావు, కన్నా మాస్టారు, సంగీత కళాకారుల సంఘం అధ్యక్షులు ఎం.వెంకటస్వామి, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, పప్పుల దేవదాస్ , మిరియాల ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. దివ్యమంగళం

దివ్యాంగ జంటకు వివాహం



దివ్యాంగ జంటకు మంగళసూత్రం అందజేస్తున్న డాక్టర్ రమణ యశస్వీ

నెహ్రూనగర్: దివ్యాంగుల వివాహ ఇన్ఫో సొసైటీ ఆధ్వర్యంలో గుంటూరులోని అంబేడ్కర్ భవన్‌లో దివ్యాంగ జంటకు వివాహం జరిపించారు. నెల్లూరు జిల్లాకు చెందిన కాళహస్తి తిరుమలేష్, కరీంనగర్‌కు చెందిన భస్వరాజు స్వప్నలు ఆదివారం వివాహంతో ఒక్కటయ్యారు. కుటుంబ సభ్యుల మధ్య ఎంతో ఉత్సాహంగా వివాహ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రమణ యశస్వీ దంపతులకు మంగళసూత్రాన్ని అందజేశారు. దివ్యాంగుల వివాహాలకు సొసైటీ ప్రెసిడెంట్ 8555810100 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సురేష్, మాధురి, లక్ష్మీ, పద్మ, లక్ష్మణ్, మేరి, హని, పద్మశ్రీ, సృజన్, భాస్కర్, రాము, సునీల్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హెచ్ స్మార్ట్‌కీ హోండా యాక్టివా



నూతన వాహనాన్ని విడుదల చేసిన డీటీసీ షేక్ కరీం

పాత గుంటూరు: టూవీలర్ తయారీ దిగ్గజం హోండా మోటార్స్ పాపులర్ సెల్లింగ్ మోడల్ యాక్టివా 6జీ అప్‌గ్రేడ్ వెర్షన్ హెచ్ స్మార్ట్ కీ వాహనం మార్కెట్లోకి ఆదివారం విడుదలయింది. లాడ్జిసెంటర్‌లోని హోండా ఆథరైజ్డ్ డీలర్ అమరావతి హోండా షోరూంలో జరిగిన కార్యక్రమంలో ఉప రవాణాశాఖ కమిషనర్ షేక్ కరీం ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వాహనాన్ని వినియోగదారుడికి అందించారు. కరీం మాట్లాడుతూ పొల్యూషన్ ఫ్రీ వాహనాలను తయారుచేయడంలో హోండా సంస్థ పాత్ర ప్రశంసనీయమన్నారు. అమరావతి హోండా అధినేత రిత్విక్ రెడ్డి మాట్లాడుతూ ఈ వాహనం యాంటీ థెఫ్ట్ లాక్ టెక్నాలజీ, స్మార్ట్ అన్‌లాకింగ్, స్మార్ట్ ఫైండింగ్, వంటి ప్రధాన ఫీచర్లతో తయారు చేయబడిందన్నారు. కార్యక్రమంలో నిరంజన్, సంతోష్, మల్లికార్జురెడ్డి, సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు



టెన్నిస్ కోర్ట్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న శకుంతలాదేవి తదితరులు

గుంటూరు రూరల్: మనిషి ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని విశ్వభారతి ఫార్మా కళాశాల చైర్మన్ శకుంతలాదేవి తెలిపారు. ఆదివారం నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎక్స్‌ట్రీమ్ టెన్నిస్ కోర్టును లాంఛనంగా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మనిషి ఉరుకులు, పరుగుల జీవితానికి అలవాటుపడి వ్యాయామంపై శ్రద్ధ చూపటం లేదన్నారు. క్రీడల ద్వారా ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవచ్చని తెలిపారు. టెన్నిస్ క్రీడల అభివృద్ధికి ఇటువంటి కోర్టులు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఉదయం సాయంత్రం కనీసం ఒక గంటపాటు క్రీడలు ఆడి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టెన్నిస్ క్రీడాకారులు పాల్‌మంజూషర్, కోచ్‌లు ప్రసాద్, నరశింహారావు, మాణిక్యరెడ్డి, బలరామయ్య, రాంబాబు, జయకర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ సొత్తు రికవరీ



రికవరీ చేసిన సొత్తు, నిందితుడితో సీఐ అల్తాఫ్ హుస్సేన్, ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి

ఫిరంగిపురం: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ నుంచి నగదు, బంగారు నగలు చోరీచేసిన ఘటనలో యువకుడిని అరెస్ట్‌చేసి అతడి వద్ద నుంచి వాటిని రికవరీ చేసినట్లు సీఐ షేక్ అల్తాఫ్‌హుస్సేన్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ షేక్ అల్తాఫ్‌హుస్సేన్ కేసు వివరాలు వెల్లడించారు. ఈనెల 10న కూసం అలేఖ్య కర్నూలు నుంచి గుంటూరుకు బస్సులో వెళ్తుండగా తెల్లవారుజామున నిద్రలో ఉన్న సమయంలో ఆమె బ్యాగును ఎవరో దొంగిలించారు. దీంతో ఆమె ఫిరంగిపురం వద్ద బస్సు దిగి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాగులో బంగారు నగలు, నగదు ఉన్నాయని చెప్పడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గుంటూరు బస్టాండ్ వద్ద ఒక యువకుడు అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడనే సమాచారంతో ఎస్ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి తన సిబ్బందితో వెళ్లి అతడిని ప్రశ్నించడంతో చోరీ చేసినట్లు అంగీకరించాడు. నిందితుడిని కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన రెడ్డి రామకృష్ణగా గుర్తించారు. అతడివద్ద నుంచి బంగారు గాజులు, నల్లపూసల గొలుసు, లక్ష్మీదేవి డాలరు, రూ. 20వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ లక్ష్మీనారాయణ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. సచివాలయాల్లోను ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోం

నెహ్రూనగర్: వార్డు మెంబర్‌గా కూడా గెలవని లోకేష్ రికార్డు స్థాయిలో అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచి సీఎం అయిన వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తు ఊరుకోబోమని కృష్ణబలిజ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవానీ హెచ్చరించారు. నగరంలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన పాదయాత్రకు జనాదరణ కొరవడడంతో లోకేష్ అనుచిత వ్యాఖ్యలకు, బూతు పురాణాలకు తెరలేపాడన్నారు. పదవీకాంక్ష కోసం కుయుక్తిగా మాట్లాడితే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు కోలా మణికంఠ, బత్తుల శంకరరావు, గడ్డం సునీత, తుపాకుల లక్ష్మీ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

గుంటూరు మెడికల్: నటరాజ్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ముత్యాలరెడ్డినగర్ 7వలైనులో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా హాస్పటల్ అధినేత, న్యూరాలజిస్టు డాక్టర్ పి.నటరాజ్ మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి వల్ల నేడు నరాల జబ్బులు, వెన్నుముక సమస్యలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. మెదడు సంబంధిత వ్యాధులపై అవగాహన లేకపోవటంతో చాలా మంది సమస్య తీవ్రమయ్యే వరకు వైద్యులను సంప్రదించటం లేదన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే త్వరితగతిన నయం చేయవచ్చన్నారు. ఇలాంటి ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఉచిత వైద్యశిబిరంలో 500 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందించామని డాక్టర్ నటరాజ్ తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

నగరంపాలెం: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్. జోసఫ్ సుధీర్‌బాబు అన్నారు. కంకరగుంట రైల్వే బ్రిడ్జి వద్దనున్న ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం జరగ్గా, జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి సీహెచ్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి 7.5 కేజీల వెండి ఆభరణాలు



తాడేపల్లిరూరల్ : పెద్దవడ్లపూడి గ్రామంలో వేంచేసిన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో అమ్మవారికి ఆదివారం ఓ దాత 7.5 కేజీల వెండితో చేసిన చీర, మకర తోరణం పీఠం అందజేశారు. దాత భావన బాపయ్య మాట్లాడుతూ తన కుమార్తె, నన్నపనేని వెంకటేశ్వర్లు ధర్మపత్ని బాలరత్నం సహకారంతో అమ్మవారికి సుమారు ఆరు లక్షల రూపాయలతో 7.5 కేజీల వెండితో అమ్మవారికి చీర, మకర తోరణం, పీఠం అందించామని వివరించారు. దాత ఇచ్చిన ఆభరణాలను అమ్మవారికి అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నన్నపనేని బాలరత్నం, అన్నే అన్నపూర్ణ, జవ్వాది సామ్రాజ్యం, భావన వెంకటేశ్వరరావు, మాదాల రమేష్, నాగళ్ళ వెంకట్రావు, ఆవుల బసవ పున్నయ్య, భావన బాబు, జువ్వాది సుభాషిణి, భావన పున్నయ్య, జవ్వాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమృత హాస్పటల్‌లో 3డీ క్యాథ్‌ల్యాబ్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా, పక్కన డాక్టర్ ఉప్పటూరి అంజిత్, డాక్టర్ మన్నే సింధూర

గుంటూరు మెడికల్: అత్యవసర వైద్యసేవలు అందించటంలో గుంటూరు ఎల్లప్పుడూ ప్రథమ స్థానంలో నిలుస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఆదివారం గుంటూరు కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని అమృత హాస్పటల్స్ పై భాగంలో యాంజియో కేర్ హార్ట్ అండ్ వాస్క్యులర్ ఇనిస్టిట్యూట్‌ను వారు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యేలు ముస్తఫా, శంకరరావులు మాట్లాడుతూ గుండె జబ్బులు నానాటికి పెరిగిపోతున్న తరుణంలో అత్యాధునిక పద్ధతిలో గుండెకు ఆపరేషన్లు చేసేందుకు త్రీడీ క్యాథ్‌ల్యాబ్‌ను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఆధునిక గుండె వైద్యసేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. ఇంటర్వెషనల్ కార్డియాలజిస్టు డాక్టర్ ఉప్పుటూరి అంజిత్ మాట్లాడుతూ ఏపీలో మొట్టమొదటిసారిగా 3డీ క్యాథ్‌ల్యాబ్ వైద్యసేవలను గుంటూరు ప్రజలకు తాము అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. గుండె సంబంధిత అత్యవసర చికిత్సల కోసం హైదరాబాద్, బెంగళూరు లాంటి మెట్రోపాలిటన్ నగరాలకు వెళ్లే పనిలేకుండా గుంటూరులోని తమ త్రీడీ క్యాథ్ ల్యాబ్‌లో అన్ని వైద్యసేవలను అందిస్తున్నామని తెలిపారు. ఎలాంటి క్రిటికల్ పొజిషన్‌లో ఉన్న హార్ట్ పేషెంట్‌లకైనా తమ యాంజియోకేర్ సెంటర్‌లో అత్యవసర ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. యాంజియోగ్రామ్, హార్ట్‌లో స్టంటింగ్, బ్రెయిన్‌లో స్టంటింగ్, లెగ్‌లో స్టంటింగ్, పేస్‌మేకర్, ఇతర గుండె సంబంధిత, బ్రెయిన్ సంబంధిత సమస్యలకు ఖచ్చితత్వంతో కూడిన చికిత్స అందించవచ్చని వెల్లడించారు. స్టంట్ వేసేందుకు కెమెరాను లోపలకు పంపించి రక్తనాళాల మధ్య ఏమైనా గ్యాస్ ఉందా లేదా చూసుకుని ఖచ్చితమైన సైజులో ఖచ్చితమైన ప్రదేశంలో స్టంట్ వేస్తామన్నారు. స్టంట్ వేశాక సరైన ప్రదేశంలో సరైన సైజులో స్టంట్ ఉందా లేదా అనే విషయాన్ని కూడా కెమెరా ద్వారా పరీక్షించి ఏదైనా తేడా ఉన్నట్లయితే తక్షణమే సరిచేసే అవకాశం కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మాజీ మంత్రి ఆలపాటి రాజా, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, న్యూరోసర్జన్ డాక్టర్ ఉప్పుటూరి హేమంత్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మద్ది వినోద్‌కుమార్, స్కిన్ అండ్ కాస్మోటిక్ సర్జన్ డాక్టర్ మన్నె సింధూర, డాక్టర్ చదలవాడ ప్రియ, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్లలో క్రాఫ్ట్ బజార్ ప్రారంభం



గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలోని ఇన్నర్‌స్కేర్ సినీ థియేటర్ సమీపంలో కాఫ్ట బజార్‌ను ఆదివారం ప్రారంభించారు. క్రాఫ్ట్ బజార్ నిర్వాహకుడు జానకిరామయ్య మాట్లాడుతూ నెల రోజులపాటు ఈ బజార్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. బెడ్‌షీట్స్, జైపూర్ బెడ్‌షట్స్, కట్‌వర్క్, రెడిమేడ్, ప్లాస్టిక్ ఐటమ్స్, లెదర్ బ్యాగ్స్ తదితర వస్తువులను తక్కువ ధరకు విక్రయిస్తున్నామని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

గ్రామీణ వైద్యులు నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ బషీరుద్దీన్ వేదికపై డాక్టర్ షమ సుల్తానా, డాక్టర్ నజీరుద్దీన్ తదితరులు

గుంటూరు మెడికల్: మాన్విత కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఫస్ట్ ఎయిడ్ సేవలను అందించే గ్రామీణ వైద్యులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. హోప్‌విన్ హాస్పటల్స్, యువ నారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బ్రాడీపేటలో గ్రామీణ వైద్యులకు ఆధునిక వైద్యసేవలపై మాన్విత పేరుతో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ ప్రతినెలా గ్రామీణవైద్యులకు స్కిల్స్ పెంపొందించేందుకు మాన్విత సర్టిఫికెట్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ బషీరుద్దీన్ మాట్లాడుతూ అత్యవసర వైద్యసేవలను ఆధునిక పద్ధతుల్లో గ్రామీణ వైద్యులు ప్రాథమిక చికిత్సను ఏ విధంగా చేయాలో మెలకువలు నేర్చుకోవాలన్నారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సాంబశివరావు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాహుల్‌రెడ్డి, హాస్పటల్ మేనేజర్ పి.నాగేశ్వరరావు, ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పవని ప్రియాంక తదితరులు

శేకూరు(చేబ్రోలు): అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యం తీసుకోవాలని తెనాలి హ్యాపీ మల్టీ సూపర్‌స్పెషాలిటీ హస్పటల్ వైద్యులు ఉప్పలపు పవని ప్రియాంక చెప్పారు. చేబ్రోలు మండలం శేకూరు గ్రామంలోని సీతారామ కల్యాణ మండపంలో ఆదివారం రెడ్ క్రాస్, హ్యాపీ హస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. శేకూరు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు హస్పిటల్ ప్రతినిధులు సురేంద్ర, డి.శ్రీనివాస్ తెలిపారు. మెగా హెల్త్ క్యాంపును గ్రామ సర్పంచ్ ఎం.శ్యామల ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ పవని ప్రియాంక మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ 14న వరల్డ్ న్యూమెనియో డే నుంచి తెనాలి పరిసర ప్రాంతాల్లో హ్యాపీ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపుల ద్వారా మహిళలు, వృద్ధులు పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పసిపిల్లల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు నిమ్ముతో మరణిస్తున్నారని వివరించారు. మహిళలు గర్భసంచి క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. బీ హ్యాపీ.. బీ హెల్దీ అనే నినాదంతో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా బోన్ టెస్ట్, ప్యాప్సిమియా టెస్టులను చేస్తున్నట్లు తెలిపారు. వివిధ విభాగాల ప్రముఖ వైద్యులు ఈఎన్‌టీ డాక్టర్ అరుణ్‌తేజ్, వినీల్, గురునాథశర్మ, శ్వేత, మౌనిక, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఎం.భానుమతి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృతజ్ఞత అర్పణల పండుగ



కార్యక్రమంలో పాల్గొన్న రెవరెండ్ దైవాశీర్వాదం

పాత గుంటూరు: కొత్తపేట కుగ్లర్ వైద్యశాల ఆవరణలోని ట్రినిటీ గురుమండలంలో ఆదివారం కృతజ్ఞత అర్పణల పండుగ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రెవరెండ్ జె.దైవాశీర్వాదం పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రెవరెండ్ సాల్మన్ చక్రవర్తి మాట్లాడుతూ ఈ పండుగ ద్వారా ఏసుక్రీస్తు ప్రభువు మహిమ పొందారని అన్నారు. లోకాన ప్రజలందరినీ ఎంతో ప్రేమించి మానవులకు కావలసిన గాలి, నీరు, వెలుతురు, ఆరోగ్యం, ఆయుష్షు, ఆహారం అన్నీ అనుగ్రహిస్తున్నాడని పేర్కొన్నారు. కృతజ్ఞత అర్పణల పండుగతో ఆయన కేవలం కృతజ్ఞతను కోరుతున్నాడని సందేశమిచ్చారు. కార్యక్రమంలో కె.ఆర్నల్డ్ మోజస్, బి.లెనిన్, బి.సుదర్శనం, బి.విల్సన్‌రాజు, టి.రాజేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.